సాక్షి నిజామాబాద్

మంగళవారం ; 28 ; నవంబర్ ; 2023



కేసీఆర్‌కు బుద్ధి చెబుదాం..

కేసీఆర్ కుటుంబం ప్రజాధనాన్ని దోచుకుందని వారికి బుద్ధిచెప్పాలని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి పేర్కొన్నారు.

- 6లో ▸



గ్రహణం వీడాలంటే..

ఇందూరుకు పట్టిన గ్రహణం వీడాలంటే బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు.

- 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.3 /21.3

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అనుమతి లేకుండా ప్రకటనలు ప్రచురించొద్దు

సుభాష్‌నగర్ : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజు, అలాగే పోలింగ్‌కు ఒకరోజు ఈనెల 29, 30వ తేదీల్లో ప్రింట్ మీడియాలో అభ్యర్థులు ఎలాంటి ప్రచార ప్రకటనలను ప్రచురించవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని పక్షంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామన్నారు.

29, 30న ప్రభుత్వ పాఠశాలలకు సెలవు

ఖలీల్‌వాడి : ఈనెల 29, 30న జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రెండ్రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది రావడంతోపాటు ఎన్నికలకు ఏర్పాట్లు, 30న పోలింగ్ ఉండటంతో సెలవులను ప్రకటించినట్లు తెలిపారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈవీఎం యంత్రాల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



సుభాష్‌నగర్ : శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్ కేంద్రంలో సదుపాయాలు ఏర్పర్చాలన్నారు. 28వ తేదీ తర్వాత 48 గంటల పాటు సైలెంట్ పిరియడ్‌లో నాయకులకు నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సదుపాయాలు కల్పించాలన్నారు. సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్‌పోల్ నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు

- జిల్లాలో 3,500 మంది పోలీసులు, 1200 మంది కేంద్ర బలగాలు
- 28 నుంచి 4 వరకు 144 సెక్షన్
- సీపీ కల్మేశ్వర్ వెల్లడి

ఖలీల్‌వాడి : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. అర్బన్, రూరల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ నియోజకవర్గంలోని 6 మండలాల్లో జరిగే ఎన్నికల్లో 759 పోలింగ్ కేంద్రాలుండగా పోలింగ్‌బూత్‌లు 1,423 ఉన్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి 3500 మంది పోలీసు సిబ్బంది, 1200 మంది కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 250 పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బందిని మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వారికి కేటాయించిన స్థలాలకు తరలిస్తామన్నారు.

ప్రజలు నిబంధనలు పాటించాలని కోరారు. 28న 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కాబట్టి ఐదుగురి కంటే ఎక్కువ వ్యక్తులు ఒకచోట ఉండవద్దన్నారు. పోలింగ్‌కు 48గంటల ముందు ఎలాంటి ప్రచారం చేయవద్దు. స్థానికేతరులు ఎవ్వరూ ఉండవద్దు. అనివార్య కారణాల ఉండాల్సి వస్తే తగిన ఆధారాలు చూపాలన్నారు. మద్యం దుకాణాదారులు టోకెన్ల విధానంలో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటాకులు కాల్చవద్దన్నారు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ఉండే ఇంటి యజమానులు కొత్త వ్యక్తులకు ఆశ్రయవ ఇవ్వొద్దన్నారు. డిసెంబర్ 30వ వరకు, డిసెంబర్ 3న వైన్ షాపులు, కల్లుదుకాణాలు తప్పనిసరిగా మూసి ఉంచాలి.

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం

బీజేపీకి రాష్ట్రంలో అధికారం అందించాలి

- కాంగ్రెస్‌దంతా అవినీతి, కుంభకోణాల చరిత్రే..
- బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షసుల సమితి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

జంగ్ తెలంగాణ



బోధన్‌లో సకల జనుల విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బోధన్ బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి

బోధన్ : బీజేపీ అధికారంలోని రాగానే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, ఇప్పటికే ప్రధాని మోదీ రామగుండం ఫ్యాక్టరీని తెరిపించారని, నిజామబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు జరుగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ మైదానంలో బీజేపీ అభ్యర్థి వడ్డీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వడ్డీ మోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలపించాలన్నారు.

బీఆర్ఎస్ అంటే..

బీఆర్ఎస్ అంటేనే భ్రష్టాచార్ రాక్షసుల సమితి అని అభివర్ణించారు. అవినీతి, కుంభకోణాలకు నిలయంగా బీఆర్ఎస్ మారిందన్నారు. పదేళ్ల పాలనలో ధరణి పోర్టల్ పెట్టి భూములను హరించారన్నారు. పీఎం ఆవాస్ యోజనను డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకంగా మార్చారని, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి పోర్టల్, భూ అవినీతి అక్రమాల పై విచారణ చేసి, దోషులందరినీ జైలుకు పంపిస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనా రూ.38 వేల కోట్ల ప్రాజెక్ట్‌ను రూ. లక్ష 20 వేల కోట్లకు పెంచి దోచుకున్నారన్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు కుంగిపోయిందన్నారు. మియాపూర్ భూముల్లో దోచుకున్నారని, ఔటర్ రింగ్ భూముల్లో రూ. 1,000 కోట్లు చేతులు మారాయన్నారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న ప్రభుత్వం దళిత బంధు కాదు, దళిత శత్రువు అన్నారు. అవినీతి చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు రాష్ట్రంలో మళ్లీ అధికారం ఇస్తే ఆ పార్టీ అదే తోవలో నడుస్తుందన్నారు.

సభకు అశేష ప్రజానీకం..

నియోజక వర్గంలోని నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు, బీజేపీ, శివసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు, యువత అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో నడ్డా సభలో బోధన్ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చినట్లయ్యింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజక వర్గ ప్రభావరి రాంచరణ్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, రెంజల్ మండల ఎంపీపీ, జెడ్పీటీసీలు రజినీ కిషోర్, మేకల విజయ సంతోష్, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు బాల్‌రాజ్, ఇంద్రకరణ్, మనోహర్, ప్రవీణ్, నరిన్, గోపికృష్ణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర..

మోదీ ప్రభుత్వంలో ఒక్క కుంభకోణం కూడా జరుగలేదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను 5వ స్థానంలో నిలిపారన్నారు. మళ్లీ మోదీని పీఎం చేస్తే దేశం 3స్థానంలో ఉంటుందన్నారు. తెలంగాణలోని సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి వందేభారత్ రైళ్లు, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయన్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. వరికి క్వింటాలుకు రూ. 3,100 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. యువతకు రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి మాట్లాడుతు మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ఈ సారి ఎన్నికల్లో నిజాంషుగర్స్ పునరుద్ధరణను ఎన్నికల మేనిఫెస్టోలో ఉందని పేర్కొన్నారు. బీజేపీకి అధికారం ఇవ్వాలని, బోధన్‌లో మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి గెలుపు ఖాయమని, బోధన్ గడ్డపై కాషాయం జెండా ఎగురబోతుందన్నారు. రాష్ట్రం కోసం బోధన్‌లో 1,519 రోజుల పాటు ఉద్యమ దీక్షలు జరిగినప్పుడు ఇద్దరు అభ్యర్థులు లేరన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి..

- వడ్డీ మోహన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి



బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలిసారిగా పోటీ చేస్తున్న తనకు ఆశీర్వదించి ఒక్కసారి అవకాశమివ్వాలని, ఏ ప్రభుత్వమున్నా కొట్లాడి నిధులు తీసుకొచ్చి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డీ మోహన్ రెడ్డి ప్రజలను కోరారు. ప్రత్యర్థి అభ్యర్థులు సుదర్శన్‌రెడ్డి 3సార్లు, షకీల్ 2సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా అభివృద్ధి జరగలేదన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఒక వర్గం ప్రజల సంక్షేమానికి 70 శాతం నిధులు కేటాయిస్తున్నారని, 70 శాతం జనాభా ఉన్న ప్రజలకు 30 శాతం నిధులు కేటాయించి వివక్ష చూపుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి పాటు పడుతానన్నారు.

ఆ రెండూ అవినీతి పార్టీలే..

బాన్సువాడ/మద్నూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. సోమవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం మేనూర్ సమీపంలో నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలనతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 2జీ, క్రీడలు, బొగ్గు, బియ్యం ఇలా దేనినీ వదలకుండా అక్రమాలకు పాల్పడిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు.



జేపీ నడ్డాతో బాన్సువాడ అభ్యర్థి యెండల

బాండ్ పేపర్ రాసిచ్చిన యెండల..

వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు నమ్మకం ఉండేందుకు బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ బాండ్‌పేపర్ రాసి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు అందించారు. నన్ను నమ్మి ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, పదేళ్ల లో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తానన్నారు.



సభకు హాజరైన ప్రజలు



సభలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న మహిళ

రైతుబంధును ఆపిన పాపం కాంగ్రెస్‌దే..

- రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- ఢిల్లీ నుంచి వస్తోన్న మిడతల దండు పనిపట్టాలి
- బుల్డోజర్లు కాదు.. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడిస్తేనే రైతులకు బాగుంటుంది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ నాగారం : ఎన్నికల కమిషన్ రైతుబంధు వేయడానికి అనుమతిచ్చిన వెంటనే కాంగ్రెస్ అభద్రతాభావంతో రైతుబంధును అడ్డుకొని, రైతు వ్యతిరేకి అయ్యిందని.. ఢిల్లీ నుంచి వస్తున్న బీజేపీ మిడతల దండు పని పట్టాల్సిందేనని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి ట్రైలర్ చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు భయపడుతున్నాయన్నారు. సోమవారం నగరంలోని కవిత కార్యలయంలో మాట్లాడారు. యూపీ యోగి వచ్చి తెలంగాణలో బుల్డోజర్ తిప్పుతామంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు వచ్చినా కారు వాటిపై దాడి చేస్తుందన్నారు. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు తిరగాలని బుల్డోజర్లు కాదన్నారు. బొగ్గు గనిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిందే కాంగ్రెస్ అని ప్రియాంకా గాంధీ మాటలు వింటే నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావట్లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటబడి రైతు బంధు పథకాన్ని ఆపించారన్నారు. ఈ పథకం కింద 65 లక్షల మంది రైతులకు రూ. 72 వేల కోట్ల మేర నిధులిచ్చామని, దాంతో రైతులు బీఆర్ఎస్ వైపు ఉన్నారన్న అభద్రతతో కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందన్నారు. రైతుల నోటికాడి బుక్కను గుంజుకున్నారని నిప్పులు చెరిగారు.

బీజేపీ అంటేనే అబద్ధాలు..

అబద్ధాలు చెప్పడం తప్పా రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. ఒకరు భాగ్యలక్ష్మి దేవాలయం అంటారు.. మరొకరు భైంసాకు వెళ్లి ఏదో చేస్తామంటారు తప్పా భరోసా, భద్రత ఇచ్చేలా బీజేపీ ప్రయత్నం చేయలేదన్నారు. నిజామాబాద్‌లో ఉన్నమా లేదా హైదరాబాద్‌లో ఉ న్నామా అనుకునేంత స్థాయిలో నిజామాబాద్‌ను అ భివృద్ధి చేశామన్నారు. మూడోసారీ ఎమ్మెల్యే బిగాలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, అర్బన్ అభర్థి బిగాల గణేష్‌గుప్తా, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అలీం పాల్గొన్నారు.

నేటితో ప్రచారానికి తెర!

- సాయంత్రం 5 గంటల వరకే అనుమతి..
- మూగబోనున్న మైక్ సెట్లు, డీజేలు..
- ఇక పోల్ మేనేజ్‌మెంట్‌పై అభ్యర్థుల దృష్టి



సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి మంగళవారం సాయంత్రం 5 గంటలతో తెరపడనుంది. 20 రోజుల పాటు గ్రామాల్లో, పట్టణాల్లో హోరెత్తించిన మైక్ సెట్లు, డీజేలు మూగబోనున్నాయి. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. ఈనెల 10 వరకు నామినేషన్లు స్వీకరించారు. 15న బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా విడుదల చేసి గుర్తులు కేటాయించారు. నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో జోరుగా ప్రచారాన్ని మొదలుపెట్టారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ అభ్యర్థులు పదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మరోసారి అవకాశమివ్వాలని ప్రచారం చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు తమకు ఒకసారి అవకాశమిస్తే బీఆర్ఎస్ కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారం ముగిసిపోనుండగా, పోలింగ్‌కు మరో రెండ్రోజులే సమయం ఉండటంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రి నుంచే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రచిస్తున్నారు. ముఖ్యంగా కుల సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలపై దృష్టిసారిస్తున్నారు. వారికి అవసరమైన హామీలిస్తూ ఓట్లు రాబట్టుకునేలా పావులు కదుపుతున్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీటికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు చేపడుతారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

దాడులకు భయపడం..

- బాధితుడిని పరామర్శించిన బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్



శ్రీనివాస్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ధన్‌పాల్

సుభాష్‌నగర్ : నగరంలో బీజేపీ కార్యకర్తలపై ఓ వర్గం నాయకులు దాడులు చేస్తే భయపడేది లేదని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని 41వ డివిజన్ చంద్రశేఖర్‌కాలనీ బీజేపీ 15వ బూత్ అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్‌పై 15మందితో కూడిన ఓ వర్గం దాడిచేసిన విషయాన్ని తెలుసుకున్న ధన్‌పాల్ బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి గల కారణాలను, దాడిచేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఇలాంటి ఘటనలే పునరావృతం అవుతాయన్నారు.



కార్తీక దీపోత్సవం

కార్తీకమాసంలో భాగంగా సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని గంగస్థాన్‌లో గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. - నిజామాబాద్ సిటీ

ఆరు గ్యారంటీలు అమలు చేస్తా



బాండ్ పేపర్‌ను చూపుతున్న ముత్యాల సునీల్

భీమ్‌గల్ : కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను బాల్కొండ నియోజకవర్గంలో ఖచ్చితంగా అమలు చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ అన్నారు. సోమవారం ఆయన నింబాచల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం(లింబాద్రి గుట్ట) వద్ద పూజలు నిర్వహించి బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్‌పేపర్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి పునరంకితమవుతానని, ఎప్పటిలాగే ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. బాల్కొండ నియోజకవర్గ పురోగతికి విశేషంగా కృషి చేస్తానని నృసింహస్వామి సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు.

'బాండ్ పేపర్'తో మోసం చేస్తున్నారు

బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలను బాండ్‌పేపర్ పేరుతో మోసం చేస్తున్నాడని చూస్తున్నాడని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బాల్కొండ మండలం నాగాపూర్, బస్సాపూర్, ముప్కాల్ మండలం నాగంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో అమలు చేయలేని హామీలిచ్చి బోల్తా పడ్డ కాంగ్రెస్‌పార్టీ ఇక్కడ కూడా అవే హామీలు ఇస్తున్నారన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ అర్వింద్ రైతులను మోసం చేశాడన్నారు. ప్రస్తుతం సునీల్‌రెడ్డి సైతం బాండ్ పేపర్ డ్రామాలు ఆడుతున్నారన్నారు. కరెంట్ కష్టాలు కావాలా.. 24గంటల నాణ్యమైన కరెంట్ కావాలా అంటూ ప్రజలను ఆయన ప్రశ్నించారు. కర్ణాటకలో గెలిచిన కాంగ్రెస్‌పార్టీ రూ. 750 మాత్రమే పింఛన్ ఇస్తోందని, ఇక్కడ మాత్రం రూ. 4వేలు ఇస్తామంటున్నారన్నారు. రైతు బంధు, రైతు రుణ మాఫీని ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఆపిందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక వెంటనే రేషన్‌కార్డులు, ఇళ్ల నిర్మాణాలు చేపడ్తామన్నారు. పునరుజ్జీవన పథకం ద్వారా ఎస్సారెస్పీలో ఏడాదంతా నీరుండేలా చేసుకున్నామన్నారు. భగవంతుడి సాక్షిగా నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధిచేశానన్నారు.

ప్రజలు ఆలోచన చేసి ఓటేయాలన్నారు. అధికారంలోకి రాగానే రూ. 400కే సిలిండర్, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందిస్తామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 15 లక్షల వరకు వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ, ముప్కాల్ అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

క్లుప్తంగా

మండవ రాకతో కాంగ్రెస్ బలోపేతం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు చేరికతో కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో మరింత బలం చేకూరిందని పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. సోమవారం వేణుగోపాల్ యాదవ్ డిచ్‌పల్లి మండలం ధర్మారంలో మండవను ఆయన నివాసంలో కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. నాయకులు బద్దం రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆర్మూర్‌లో ఖైసర్ ప్రచారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో సోమవారం ప్రచారం చేశారు. ఆర్మూర్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఖైసర్ మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. మాజీ కౌన్సిలర్లు మహమూద్, ఆసిఫ్, ముజీబ్, వినయ్‌రెడ్డి సతీమణి, సోదరి ఉన్నారు.

నగదు పట్టివేత



నిజాంసాగర్: మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద సోమవారం రూ.61,200 నగదు పట్టుకున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు. నాందేడ్ – సంగారెడ్డి జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేయగా ఆటోలో వెళ్తున్న వ్యక్తి వద్ద నగదు దొరికిందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



కామారెడ్డిఅర్బన్: జిల్లాలో ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా, పక్షపాతం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఐక్యవేదిక(టీపీ జేఏసీ) నాయకులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్‌తో పాటు కామారెడ్డి రిటర్నింగ్ అధికారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఎన్నికల అధికారులు కొందరు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజల్లో అభిప్రాయం ఉందని, బాధ్యతాయుతంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీపై నిఘా పెట్టాలన్నారు. కన్వీనర్ జి జగన్నాథం, కో కన్వీనర్ వీఎల్ నర్సింహరెడ్డి, న్యాయవాదులు ఎం వెంకట్‌రాంరెడ్డి, క్యాతం సిద్దిరాములు, ఎండీ అన్వర్ అలీ, పి బాల్‌రెడ్డి, బి అంగరాజ్ పాల్గొన్నారు.

బాన్సువాడ బాద్‌షా ఎవరో?

- ఎత్తులు వేయడంలో ముగ్గురూ ముగ్గురే..
- అభివృద్ధి, లోకల్ నినాదంతో పోచారం
- ఆరు గ్యారంటీలతో జనంలోకి ఏనుగు
- నీతివంతమైన పాలన అంటున్న యెండల
- రసవత్తరంగా మారిన ఎన్నికలు











సాక్షి, కామారెడ్డి: మంజీర నది తీరాన ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తులు వేయడలో ముగ్గురూ ముగ్గురే అన్నట్టుగా ఉన్నారు. ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముగ్గురు అభ్యర్థులు రాజకీయంగా అనుభవం ఉన్నవారు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నవారు. ఆయన మంత్రిగానూ పలుమార్లు పనిచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి మూడు పర్యాయాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ సుదీర్ఘ కాలంగా బీజేపీలో కొనసాగుతున్నారు. ఒక పర్యాయం ఎమ్మెల్యేగా పనిచేశారు. నియోజకవర్గంలో మున్నూరు కాపులు, ఆంధ్ర సెటిలర్లు, మైనారిటీలు, ముదిరాజ్‌లు ఎక్కువగా ఉంటారు. ఎవరి ఓట్లు ఎటు వెళ్తాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో ప్రభావం చూపే అంశాలన్నీ బాన్సువాడ నియోజకవర్గంలో కనిపిస్తాయి. బాన్సువాడ నియోజకవర్గం రెండు జిల్లాల్లో కలగలిసి ఉంటుంది. బాన్సువాడ పట్టణం, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలు కామారెడ్డి జిల్లాలో ఉండగా, కోటగిరి, వర్ని, రుద్రూర్, చందూర్, పొతంగల్, మోస్రా మండలాలు నిజామాబాద్ జిల్లా పరిధిలోకి వస్తాయి.

వరుస విజయాలతో..

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వరుస విజయాలతో ఊపు మీదున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ఐదేళ్లలో మంత్రిగా, తర్వాత అసెంబ్లీ స్పీకర్‌గా నియోజకవర్గంలో అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చారు. బాన్సువాడను మున్సిపాలిటీని చేసి, పురపాలక శాఖ ద్వారా భారీ ఎత్తు నిధులను రాబట్టి అభివృద్ధి చేశారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పించారు. సాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యతనిచ్చారు. సిద్దాపూర్, జకోరా వంటి ఎత్తిపోతల పథకాలు పురోగతిలో ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ముందువరుసలో నిలిచారు. పదకొండు వేలకు పైగా ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించారు. తాను చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు.

ఇసుక దోపిడీపై ఆరోపణలు

బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నీతివంతమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మంజీర ఇసుక దోపిడీపై ఆయన ఆరోపణలు చేస్తున్నారు. బాన్సువాడ నియోజక వర్గంలో ఏం జరుగుతుందో ఇక్కడి ప్రజలకు అంతా తెలుసని, ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకంతో ఉన్నారు. స్థానికంగా హిందుత్వ నినాదంతో పనిచేసిన వారంతా ఆయనకు సహకరిస్తున్నారు.

విస్తృత ప్రచారం..

కాంగ్రెస్ అభ్యర్థిగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బరిలో నిలిచారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. తన సతీమణి మంజులారెడ్డితో కలిసి నియోజక వర్గాన్ని చుట్టేశారు. తక్కువ సమయంలోనే ఎక్కువ గ్రామాలను తిరిగి ప్రజలకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను గురించి వివరించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేశారు. నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చాలా వరకు ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నాయి. తనను నాన్ లోకల్ అనడాన్ని రవీందర్‌రెడ్డి తిప్పికొడుతున్నారు. ఉద్యమంలో తాను జిల్లా అంతటా తిరిగానని, ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన తనను పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేశారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన తనలాంటి వాళ్లంతా బయట ఉంటే, తెలంగాణ ద్రోహులంతా కేసీఆర్ వెంట ఉన్నారని ప్రజల్లో చర్చ పెట్టారు.



అభివృద్ధి చేశా.. అండగా ఉండండి

- బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని(చందూర్): బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని.. ఈ ఎన్నికల్లో ఓటర్లందరూ అండగా నిలబడి తనకు మద్దతు పలకాలని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం చందూర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశానన్నారు. సాగు, తాగు నీరు, విద్యుత్ ,వైద్యం, విద్యతోపాటు అన్ని సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయలు మంజూరు చేశానని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే బాన్సువాడలోనే అభివృద్ధి అధికంగా జరిగిందని ఈ వాస్తవాన్ని గ్రహించి ఓట్లు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు చెప్పే మాటలను నమ్మకుండా అభివృద్ధిని కాంక్షించే తనకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. స్థానికుడిని అయిన తనను గెలిపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుడిగా అందరినీ కలుపుకొని అభివృద్ధికి పాటుపడతానన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, లావణ్యరామ్‌రెడ్డి, కవిత, అంబర్ సింగ్, సాయిరెడ్డి, సత్యనారాయణ, గంగారాం పాల్గొన్నారు.

ఎవరికీ అన్యాయం చేయలేదు

బాన్సువాడ: తన రాజకీయ జీవితంలో ఎప్పుడు తప్పు చేయలేదని, ఎవరికీ అన్యాయం చేయలేదని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం నుంచి తెచ్చిన ప్రతి రూపాయిని నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఖర్చు చేశానన్నారు. సోమవారం పట్టణంలో ఆయన ప్రచారం చేశారు. సేవ చేసే నాయకుడిని గెలిపించుకోవాలని కోరారు. తనపై పోటీకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి దుర్మార్గుడన్నారు. ఆయన మాట వినని వారిని పోలీస్ స్టేషన్‌లో వేసి కొట్టిస్తారని ఆరోపించారు. ప్రతీ పనికి కమీషన్లు తీసుకునే వ్యక్తి మనకు అవసరమా అని ప్రశ్నించారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణరెడ్డి, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, జుబేర్, అనిత, రమాదేవి, సరిత, కనుకుట్ల అనసూయ, ప్రతిమారెడ్డి, కిరణ్, గడుమల లింగం, రాజు, నర్సగౌండ ఉన్నారు.



చందూర్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణలోనే తండాల అభివృద్ధి

బాన్సువాడ రూరల్: తెలంగాణలోనే తండాలు అభివృద్ధి చెందాయని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మొగులాన్‌పల్లి, మొగులాన్‌పల్లి తండాల్లో ఆయన ప్రచారం చేశారు. కేసీఆర్ సహకారంతో ప్రతి తండాలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. బద్యానాయక్, మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్, మల్లారెడ్డి, నూరామ్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

వర్ని: వర్నిలో సోమవారం సీఆర్పీఎఫ్ బలగాలతో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని కోరుతూ కవాతు నిర్వహించినట్లు రుద్రూర్ సీఐ జితేష్‌రెడ్డి తెలిపారు.

రుద్రూర్: కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండల కేంద్రాల్లో సీఐ జయేష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కవాతు నిర్వహించారు. ఎస్సైలు సందీప్, నీరేష్ పాల్గొన్నారు.



వర్నిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శివనామస్మరణతో మారుమోగిన కేదారేశ్వరం

నందిపేట్: నందిపేట్ సమీపంలోని పలుగుట్ట ప్రాంతంలో గల శ్రీ కేదారేశ్వర ఆశ్రమం సోమవారం శివ నామస్మరణతో మారుమోగింది. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ 36 రోజుల దీక్షను ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు విరమించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో జాతర జరిగింది. మంగిరాములు మహరాజ్ దసరా పర్వదినాన దీక్షలోకి వెళ్లి కార్తీక పౌర్ణమి రోజు విరమించడం 35 ఏళ్లుగా ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. మహరాజ్ ఆశ్రమంలోని ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం అన్నపూజ చేసి భక్తులకు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో మంగిరాములు మహరాజ్‌కు తులాబారం చేశారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



మాట్లాడుతున్న మంగిరాములు మహరాజ్

ఆశీస్సులు తీసుకున్న అభ్యర్థులు

ఆర్మూర్ నుంచి ఎన్నికల్లో పోటీ పడుతున్న పలువురు అభ్యర్థులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి మంగిరాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు.

లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబం

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్, మాజీ ఎంపీ విజయశాంతి

ఖలీల్‌వాడి: సీఎం కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుందని, టాటా బిర్లా కంటే ఎక్కువ ఆస్తులు సంపాదించారని ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అన్నారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బ చౌరస్తాలో అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీకి మద్దతుగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడారు.

ఛత్తీస్‌గఢ్ సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్, నరేంద్రమోదీ ఒక్కటే అన్నారు. కేసీఆర్ పలు అంశాల్లో మోదీకి మద్దతు తెలపడంతో ఇప్పుడు మోదీ కేసీఆర్‌కు సాయం చేస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత దొరికిన కేసులు నమోదు చేయలేదన్నారు. తమ రాష్ట్రంలో వరికి క్వింటాలుకు రూ.2500 చెల్లిస్తున్నామని, తునికాకు సేకరణ చేసే వారికి 40 శాతం అదనంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీని గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ విజయశాంతి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం ఇసుక దందా, గ్రానైట్, మొరం దందా, ప్రాజెక్టులలో కమీషన్లు వసూలు చేసిందని ఆరోపించారు. కాళేశ్వరంలో నాణ్యత లేకపోవడంతోనే మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయాయన్నారు. తెలంగాణ బిల్లు పెట్టే సమయంలో కేసీఆర్ పార్లమెంట్ నుంచి పారిపోయాడని చెప్పారు. బిల్లు పాస్ అయ్యే వరకు తాను అక్కడ ఉన్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌పై బీజేపీ రాష్ట్ర నాయకత్వం పోరాటాలు చేసిందని, కేంద్రంతో బీఆర్‌ఎస్‌కు చీకటి ఒప్పందం ఉండటంతోనే చర్యలు చేపట్టలేదన్నారు. మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, గడుగు రోహిత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్

కేసీఆర్‌కు బుద్ధి చెబుదాం

మోర్తాడ్: లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు. పాలనను గాలికి వదిలేసి ఫాంహౌజ్‌కు పరిమితమైన ముఖ్యమంత్రి మనకు అవసరమా అని ప్రశ్నించారు.

సోమవారం మోర్తాడ్‌లో బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డికి మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. అనంతరం స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఎంతో మంది ఉద్యమకారుల త్యాగాలతో తెలంగాణ సాధించుకుంటే దొంగ మాటలు చెప్పి రెండుసార్లు అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోలేదని ఆరోపించారు. బీజేపీ కేసీఆర్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవడంతో విసిగిపోయి కాంగ్రెస్‌లో చేరానన్నారు. ప్రజల కోసమే తాను పార్టీ మారానని చెప్పారు. కేసీఆర్‌ను గద్దె దింపే వరకు నిద్రపోను అన్నారు. దొరల పాలనకు స్వస్తి పలికి ప్రజా పాలనకు బాటలు వేయాలన్నారు. మహిళలకు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న విజయశాంతి

క్రైం కార్నర్

లారీని ఢీకొని ఒకరికి గాయాలు



మోపాల్: మండలంలోని బోర్గాం(పి) శివారులో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కోటగల్లికి చెందిన లింబాద్రి మోపాల్ నుంచి నిజామాబాద్ వైపు బైక్‌పై వస్తున్నాడు. వాహనం అదుపు తప్పి ముందు వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో లింబాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. లింబాద్రి మార్కండేయ మందిరంలో పూజారిగా ఉన్నారు.

పలువురిపై కేసు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ రూరల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముదక్‌పల్లికి వచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత బాజిరెడ్డి గోవర్ధన్ వెళ్లిపోయారు. ఈక్రమంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో ఢీకొని గురుకుల విద్యార్థి మృతి



సయ్యద్ అహ్మద్ (ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సయ్యద్ అహ్మద్(11) ఆటో ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేష్, ఆర్‌సీవో అబ్దుల్ బషీర్ తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నగరం బాబన్ సాహెబ్ పహడ్, వెంగల్‌రావు కాలనీకి చెందిన అహ్మద్ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం బాలుడి అమ్మమ్మ బేగం బీ, చిన్నమ్మ హైమాదీ బేగం పాఠశాలకు వచ్చారు. హైమదీ బేగం పిల్లలు కూడా ఇదే పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురు పిల్లలను సమీపంలోని దర్గా వద్దకు తీసుకెళ్లి తమ వెంట తెచ్చిన భోజనం తినిపించారు. అనంతరం తిరిగి పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు పైకి వచ్చారు. అదే సమయంలో డిచ్‌పల్లి నుంచి ముల్లంగి(ఐ) వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో అహ్మద్‌ను ఢీకొంది. వెంటనే ఆటో డ్రైవర్ ప్రయాణికులను అక్కడే దింపి, అహ్మద్‌ను మొదట డిచ్‌పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. బాలుడి తల్లి రిజ్వానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన మచ్చ గంగమణి (67) నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ సోమవారం తెలిపారు. గంగమణి భర్త గతంలోనే మృతి చెందాడు. కొడుకు నిజామాబాద్ నగరంలో ఉంటున్నాడు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ సమస్య తాళలేక ఆదివారం కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఆమె మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. మృతురాలి కొడుకు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కుంటలో పడి మహిళ మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లలో నీటి కుంటలో పడి మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంగళి అనిత (24) దుస్తులు ఉతికేందుకు వెళ్లి కాలు జారి కుంటలో పడిపోయింది. మృతురాలికి భర్త రమేశ్, ఏడాదిన్నరు కుమారుడు ఉన్నారు.

పాపను వదిలి వెళ్లారు



నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ తండాలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు పాపను వదిలి వెళ్లారని ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. ఏడాది వయసు గల ఆ పాపను చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో అప్పగించామన్నారు. పాప వివరాలు తెలిస్తే 8712659849 నంబర్ సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లిలో నీల చంద్రంకు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



నగరంలో బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న మహిళలు

గ్రహణం వీడాలంటే సూర్యుడిని గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్
- అభివృద్ధి పేరుతో అవినీతి : బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఇందూరు నగరానికి గ్రహణం పట్టిందని, ఆ గ్రహణం వీడాలంటే సూర్యుడి (ధన్‌పాల్ సూర్యనారాయణ)ని గెలిపించాలని బీజేపీ రాష్ట నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు. సోమవారం నగరంలో బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రచారంలో భాగంగా శివాజీ చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హిందుత్వంపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, హిందు దేవుళ్ల, దేవతలను కించపర్చే వారికి వ్యతిరేకమన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ఎంఐఎంకు వేసినట్లేనని, ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీతో అంటకాగడం ఎంఐఎంకు అలవాటైందని విమర్శించారు. నగరం అభివృద్ధి చెందాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో సూర్యనారాయణను గెలిపించుకోవాలని కోరారు.

బీజేపీతోనే మహిళలకు రక్షణ

దేశంలో మహిళలకు రక్షణ కల్పించేది బీజేపీయే అని సినీ నటి కవిత పేర్కొన్నారు. నగరంలోని గాంధీచౌక్‌లో బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా నాయకులు భారీ ర్యాలీతో మద్దతు పలికారు.

పీఎఫ్ఐకి అడ్డాగా మార్చారు

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఇందూరు నగరాన్ని పీఎఫ్ఐకి అడ్డాగా మార్చారని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో గణేశ్‌గుప్తా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. బీఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతు ప్రకటించిన విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, అందరి కష్టాల్లో పాలు పంచుకుంటానని హామీ ఇచ్చారు. ట్రస్ట్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి లింగం, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, ఏలేటి సిద్ధార్థరెడ్డి, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, బూర్గుల ఇందిరా వినోద్, చందుపట్ల వనిత శ్రీనివాస్, మెట్టు విజయ్, సుక్క మధు, ఇప్పకాయల వనిత కిశోర్, బంటు వైష్ణవి రాము, పంచరెడ్డి లావణ్య, పుట్ట వీరేందర్, రోషన్ పాల్గొన్నారు.



చీకోటి ప్రవీణ్‌ను సన్మానిస్తున్న ధన్‌పాల్



మాట్లాడుతున్న సినీ నటి కవిత